# ఇన్‌లాండ్ కవర్ కథలు

## స్వామీజీ

ఊరు ఊరంతా ఒక్కటేమాట. ఎవరో గొప్ప స్వామిజీ ఆ వూరుకు విచ్చేసారని ఎక్కడెక్కడి నుంచి జనం విపరీతంగా ఆయన దర్శనం చేసుకుంటున్నారని, ఆయన ఇదివరకు ఎప్పుడూ రాలేదని, ఇదే ప్రథమంగా రావడమని, గొప్ప మహిమాన్వితుడని, ఆయన భక్తుల కోర్కెలు తీరుస్తున్నాడని, కష్టాలకు నివారణోపాయాలు తెలుపుతున్నారని అనుకుంటున్నారు ఆ వూరి ప్రజలు. ఆ మాటలు మూర్తి చెవిన పడ్డాయి.

తను అప్పుడప్పుడు స్వామీజీల గురించి వింటూనే ఉంటాడు మూర్తి. వీలయినన్ని సార్లు స్వామీజీల దర్శనాలు చేస్తుంటాడు. అతనికి ఏ కోరికలు లేవు. చక్కటి ఉద్యోగం నాలుగంకెల జీతం. సొంత యిల్లు, జీవితంలో స్థిరపడిన పిల్లలు, జీవితం సౌఖ్యంగా జీవించడానికి సరి పడా ధనాదాయం అన్నీ ఉన్నాయి. కాని అతనికి ఒకటే సమస్య. అది తన భార్య గురించి. ఆమె సుమారుగా చదువుకుంది. కాని వచ్చిన చిక్కల్లా తాను పట్టినది మూడే కాళ్లు అనే తత్వం. పూర్తిగా గయ్యాళి కాదు గాని ఆ కోవకు చెందినదేనని మూర్తి అభిప్రాయం. చాలా వాటిల్లో తాను అవునన్నది కాదంటుంది. కాదన్నది అవునంటుంది. ఈ సమస్య ఎలా పరిష్కరించి, ఆమెను తన మార్గమునకు తెచ్చు కోవాలో తెలియక సతమతమవుతున్నాడు మూర్తి. తన డబ్బు విషయంలో లిబరల్‌గా ఉంటాడు. కాని ఆమె దానికి ఎదురు. తనకి చుట్టాలు పక్కాలు రావటమంటే యిష్టం. కాని ఆమెకు అది గిట్టదు. ఎంతమందితోనో పరోక్షంగా చెప్పించాడు తన దృక్పథం గురించి. కాని ఫలితం శూన్యం. ఆమె తన తత్వం మార్చుకోదు. దాని వలన యింట్లో కలతలు తరుచుగా తలెత్తుతున్నాయి. ఒక్కోసారి జీవితంపై విరక్తి పుడుతోంది.

స్వామీజీని కలుద్దామని మూర్తి తీర్మానించుకున్నాడు. ఏ వుట్టలో ఏ పాముందో తన సమస్య తీరితే బాగుండు ననుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఒక సంచీ తీసుకుని పూజ ద్రవ్యాలు కొని స్కూటరుకు తగిలించుకుని బయలు దేరాడు. మనస్సులో స్వామీజీకి ఎట్లా విన్నవించుకోవాలో రీహర్సలు వేసుకున్నాడు. ఆశ్రమం సమీపించాడు. ఆశ్రమం వచ్చే భక్తులతో, వెళ్లే భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తులలో ఎక్కువ శాతం ఆడవారు కనిపిస్తున్నారు. పట్టు చీరల్లో భక్తి ప్రపత్తులతో విలసిల్లుతున్నారు. ఆశ్రమం చుట్టూ తాత్కాలికంగా చిన్నచిన్న షాపులు వెలిసాయి. స్కూటరు స్టాండు వేసి, లాక్ చేసి, సంచీ తీసుకుని లోపలకు ప్రవేశించాడు. అక్కడ స్వామీజీని కలుసుకొనే పద్ధతి ఎలాగో దర్యాప్తు తీశాడు ముందుగా పేరు నమోదు చేసుకుని స్వామీజీ వద్దకు వెళ్లాడు.

"ఏం కావాలి నాయనా" అని ప్రశ్నించాడు.

"మీఅనుగ్రహం కావాలి స్వామి" అన్నాడు మూర్తి.

"లౌకిక బాధలేమైనా ఉన్నాయా?" అన్నాడు స్వామీజీ.

"ఉంది స్వామీజీ. దానికోసమే వచ్చాను" అన్నాడు మూర్తి.

"ఏమిటి నీ సమస్య" అన్నాడు స్వామీజీ.

"నా భార్య స్వామీ, నేను చెప్పింది వినదు స్వామీ. ఆవిడ గయ్యాళి తనం తట్టుకోలేకుండా ఉన్నాను. అది మారే మార్గం చెప్పి పుణ్యం కట్టుకోండి స్వామీ" అన్నాడు దీనంగా మూర్తి.

"నాయనా నాకు అదే సమస్య ఎదురై ఈ మార్గాన్ని ఎన్నుకున్నాను" అన్నాడు స్వామీజీ చిరు నవ్వుతో.

అంతే మూర్తి అవాక్కయిపోయాడు.

— దివాకర్ల వెంకటేశ్వర్లు.

## గుణపాఠం

ఏవండోయ్!

బారెడు పొద్దెక్కింది లేచి రెడీ అవండి. పంకజం గొంతు వినగానే ఒక్క ఉదుటన లేచి, టైము చూసుకున్నాడు తన మిత్రుడితో కలిసి, జ్యోతిష్య పండితుడు పిచ్చయ్య శాస్త్రి వద్దకు బయలు దేరాడు.

తన స్వపరిచయం చేసుకున్న తరువాత, నెమ్మదిగా తన జీవితంలో గతంలో జరిగిన కొన్ని సంఘటనల గురించి అడిగి తెలుసుకున్నాడు. భవిష్యత్తులో తన జీవితంలో జరగబోయే అతి ముఖ్య సంఘటనను శాస్త్రి గారి నోటి వెంట విని ఖంగుతిన్నాడు. నాకు అతి త్వరలో ప్రాణగండం ఉంది. దాని నుంచి బయట పడడం అసాధ్యం అని చెప్పాడు. వెంకట్రావుకి దాదాపుగా గుండె ఆగినంత పనైంది. ప్రక్కనే వున్న తన మిత్రుడు ఎందువల్లనో పిచ్చయ్య శాస్త్రి ఆయుష్షు ఎంతో అడిగి తెలుసుకున్నాడు. నాకేమి? భేషుగ్గా ఇంకా 40 సంవత్సరాలు బతుకుతాను అన్నాడు. ఇవ్వాల్సిన ముడుపులు చెల్లించి ఇద్దరు బయట పడ్డారు.

ఆ రోజు నుంచి వెంకట్రావు బతుకు బితుకు బితుకుగా తయారయింది. ఆఫీసుకి శెలవు పెట్టి పిచ్చి వాడిలా తయారయ్యాడు. ఆ దిగులుతో మంచం కూడా ఎక్కాడు. వెంకట్రావు పరిస్థితి చూసి పంకజం తెగ దిగాలు పడిపోయింది.

పది రోజుల తర్వాత ఒకరోజు తన మిత్రుడు న్యూస్ పేపర్‌తో ప్రత్యక్షమయ్యాడు. జ్యోతిష్య పండితుడు పిచ్చయ్య శాస్త్రికి శ్రద్ధాంజలి తెలుపుతూ ఆయన బంధు మిత్రులు ప్రకటించారు. ఓ మూలగా వున్న చిన్న ప్రకటన అది.

ఈ విషయం చదవగానే వెంకట్రావుకి గొంతులో వెలక్కాయ పడినట్టు అయింది. వెంటనే తేరుకుని ఇంకా 40 సంవత్సరాలు దీర్ఘాయుష్షు ఉందన్నవాడు ప ది రోజులు తిరగకుండానే బాల్చీ తన్నేశాడు. తన గురించి తనకే తెలియని వాడు నా గురించి చెప్పి అనవసరంగా భయపెట్టి చంపాడు. మొత్తానికి శాస్త్రి చస్తూ చస్తూ నాకు మంచి గుణపాఠం నేర్పాడు అనుకున్నాడు.

— ఎ. సునీత

## అనుభవ శకలాలు

ఆ కాగితాలను కాల్చి మసి చేద్దామంటే మనసొప్పడం లేదు. పులి పిల్లల్ని పెట్టి ఆకలితో తన పిల్లల్ని తనే తింటుందట. ఏ కాలం బాగుండో ఆ పులి ఉనికి నుండి తప్పించుకుని మిగిలితే ఏ ఒకటో రెండో పిల్లలు పెరిగి పెద్దవై తమ అస్థిత్వం కాపాడుకొని బతుకుతాయి. ఆ కాగితాల్లోని రచనలు కొన్ని ఏరి వాటికి మళ్ళీ రూపకల్పన చేస్తే బతికి నలుస్తాయేమో! కాని పాత ఓపిక ఉత్సాహం లేదు. వాటితో లోకానికి పనేమిటి అనిపిస్తుంది.

పన్నెండేళ్ళనాడు పెళ్ళయిన కొత్తలో మొదటిసారి అడిగింది భార్య "ఏమండీ, మీరు నవలలు రాస్తారటగా" అని. ఎవరు చెప్పారు అని నేను అడిగాను. తెలిసినవాళ్ళు చెప్పారు అంది.

నామౌనమే ఆమెకు సమాధానం అయ్యింది.

వాటి ప్రస్తావన మళ్ళీ ఎప్పుడు తేలేదు ఆమె. కాలక్రమంలో పదేళ్ళు గడిచిపోయినాయి. ఒకనాడు ఆమెనే చెప్పింది. "ఆ కాగితాల కట్టలకు చెదలు పట్టాయి" అని. తీసి చూశాను. ప్రాణం విలవిలలాడిపోయింది. కాగితాలను ఏ పేజీకాపేజీ తూట్లు తూట్లుగా చెదలు తినేశాయి. ఆ కాగితాలను తడుముతూ ఉంటే కళ్ళల్లో కన్నీటి చెమ్మ తీరుగా ఉంది. అగ్గిపుల్ల తీసుకుని కాగితాలను కాల్చేస్తున్నప్పుడు నిజంగా నా బిడ్డలను నేనే నిప్పుల్లో కాల్చేస్తున్నట్టుగా ఆ అగ్నిశిఖల శిథిలాల్లోంచి ఇరువై ఏళ్ళనాటి జ్ఞాపకాల పొరల్లోంచి ఓ స్త్రీ మూర్తి అలలా కదిలి నన్ను విచలితున్ని చేసింది.

"ఏవండీ ఎందుకా పని చేస్తున్నారు" అని భార్యామణి అంటుంటే

"నా జ్ఞాపకాలను కాల్చేసుకుంటున్నాను" అని చెప్పడానికి మాటలు రాలేదు.

— సబ్బని లక్ష్మీనారాయణ.

కొత్త రచయితలు మాత్రమే ఇన్లాండ్ కవర్‌మీద కథలు రాసి పంపాలి.